కోతుల బెడదతో బెంబేలు

● గుంపులుగా వీధుల్లో స్వైరవిహారం
● రక్షణ కోసం షాపులకు జాలీల ఏర్పాటు

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో కోతుల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకు కోతుల సంఖ్యలో పెరుగుతోంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిరోజూ కోతులు గుంపులుగా తిరుగుతూ విరుచుకు పడుతున్నాయి. ఇళ్లలో, దుకాణాల్లోకి చొరబడి తినుబండారాలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్తుండడంతోపాటు పండ్ల చెట్లను, పూలమొక్కలను, వాటర్ ట్యాంకుల పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి భోజనంతోపాటు పప్పు దినుసులు, ఇతర విలువైన సామగ్రి పట్టుకెళ్తున్న దుస్థితి నెలకొంది. కిరాణా షాపుల, పండ్ల దుకాణాల యజమానుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పలు కిరాణా షాపుల్లోకి కోతుల గుంపులు దూరి సామగ్రిని చిందర వందర చేయడంతోపాటు యజమానులపై దాడులకు దిగుతుండడంతో పట్టణంలోని పలువురు తమ షాపుల్లోకి కోతులు రాకుండా రక్షణగా జాలీలు ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి కనపడుతోంది. ఇళ్లపై ఉన్న పెంకులను ధ్వంసం చేస్తూ పలు చోట్ల కోతులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇళ్లల్లో పలువురు పెంచుకున్న మామిడి, జామ, బొప్పాయి, తదితర పండ్ల చెట్లతోపాటు కూరగాయల మొక్కలను వదలడం లేదంటూ పలువురు వాపోతున్నారు. కోతులను తరిమే ప్రయత్నంలో పలువురు పట్టణ వాసులు కాటుకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. కోతుల దాడులు తాళలేక కొందరు టపాసులు ఉంచుకుంటూ కోతులు రాగానే వాటిని పేల్చుతూ తమను తాము రక్షించుకుంటున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కోతుల నివారణకు కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కలను బంధిస్తున్న తరహాలో కోతులను సైతం పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదలాలని జనం ఆకాంక్షిస్తున్నారు.


పట్టణంలో కోతుల గుంపు

ప్రమాదాల బారిన పడుతున్నాం



పదుల సంఖ్యంలో కోతులు గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. ఇటీవల ఇంట్లో పనులు చేసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కోతులు మీదకు రావడంతో కింద పడి గాయాల పాలయ్యా. కోతుల వల్ల ప్రమాదాలకు గురి కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

- సౌందర్య, వర్ధన్నపేట

కోతులను నివారించాలి



పట్టణంలో వందల సంఖ్యలో కోతులు వీరంగం సృష్టిస్తున్నాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులు నివారించాలి. పట్టణంలోకి దుకాణాల్లోకి చొరబడి సామగ్రిని చిందరవందర చేస్తూ నష్టం కలిగిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు కోతుల చేష్టలతో బెంబేలెత్తుతున్నారు.

- జాటోతు వెంకటేశ్, డీసీ తండా

పౌరహక్కులు సామాజిక బాధ్యత


వర్ధన్నపేట : మాట్లాడుతున్న తహసీల్దార్


చెన్నారావుపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ


నెక్కొండ : మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

● తహసీల్దార్ విజయసాగర్

వర్ధన్నపేట : పౌరహక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా తహసీల్దార్ విజయసాగర్ అభివర్ణించారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బండౌతాపురంలో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యాంగం ప్రజలందరికీ హక్కులు కల్పించిందని చెప్పారు. జాతి, మత, తదితర భేదాలు లేకుండా చట్ట ప్రకారం అందరికీ సమాన హక్కులు ఉంటాయని తెలిపారు. పౌరహక్కులపై సమాజంలోని ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడారు. ప్రజలు రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్‌రెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్‌కుమార్, ఎంపీఓ శ్రీధర్ రాజు, సీహెచ్‌ఓ భద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుభద్ర, పంచాయతీ కార్యదర్శి వీరన్న, సీసీ మాణిక్యం, ఆర్‌ఐ రశీద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు గడ్డం సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని సాయిరెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష చట్టరీత్యా నేరమని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంపీడీఓ బండారుపల్లి వినయకుమారి, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, అంగవాడీ టీచర్ సునీత, సీసీ యాకాంబ్రం, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయండి



సంగెం : సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఈఓ వసుమతి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వే ఆన్‌లైన్ నమోదును శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. డేటా ఎంట్రీని సకాలంలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలని ఆపరేటర్లకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఓం ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్స్‌లో ముగిసిన ఎఫ్‌డీపీ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (బిట్స్)లో 'ఐటీ అప్లికేషన్స్ అండ్ సెన్సార్ నెట్‌వర్క్, థియరెటికల్ అండ్ ప్రాక్టికల్ అప్రోచెస్' అంశంపై ఈనెల 18 నుంచి చేపట్టిన ఏఐసీటీఈ–అటల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) శనివారం ముగిసింది. ఈ సందర్భంగా బిట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హరిహరన్, డీన్ నారాయణ, ట్రిపుల్–ఈ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కోఆర్డినేటర్ శరవణన్, శ్రీధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

చెన్నారావుపేట : పేద, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల అధ్యక్షుడు అలువాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ ఫణికుమార్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శనివారం అందజేసింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. జనాభాలో 90 శాతానికిపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీలున్నారని చెప్పారు. వారికి విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర కనీస సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు కేశపాక వంశీ, రఘు, బాబు, రుత్విక్, సామ్యూల్ పాల్గొన్నారు.

మానవ వికాసంలో పోషకాలు కీలకం


పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

● 'బాలాజీ' అధినేత రాజేంద్రప్రసాద్‌రెడ్డి

నర్సంపేట : మానవ వికాసంలో పోషకాలు కీలకమని బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలాజీ ఇంటగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, అక్షర ద స్కూల్‌లో శనివారం న్యూట్రీషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇళ్లలో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శనను రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ వనజ, ఎంఈఓ జ్యోతి, ప్రిన్సిపాళ్లు జ్యోతి, భవానీ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ కూరగాయలు, పండ్లతో కూడిన సంపూర్ణ ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ భరత్, బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ, తదితరులు

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్ స్కూల్ విద్యార్థిని మద్దె శివానీ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంఈఓ లింగారెడ్డి, స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేశ్ తెలిపారు. స్కూల్ ఆవరణలో శివానీని శనివారం వారు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. అనంతరం ఎంఈఓ లింగారెడ్డి, హెచ్‌ఎం రమేశ్ మాట్లాడారు. స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న శివానీ రద్దీ ప్రాంతాల్లో పాలిచ్చే తల్లులు పిల్లలకు పాలివ్వలేక పడుతున్న ఇబ్బందులను చూసి రూపొందించిన 'పాకెట్ సైడ్ పోర్టబుల్ జాకెట్ ఫర్ ఫీడింగ్ మదర్' ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైందని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

వర్ధన్నపేట : షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధమైన ఘటన పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబం అందించిన వివరాలిలా.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన బషీర్ ఇంట్లోని చెక్క బీరువాపై ఉన్న ప్లాస్టిక్ కవర్ గాలికి విద్యుత్ హోల్డర్ లైట్‌పై పడి మంటలు అంటుకుని లోపల ఉన్న విద్యుత్ తీగలు కాలిపోయాయి. దీంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని ఇంట్లో ఉన్న బీరువా, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. వెంటనే మంటలను గుర్తించిన కుటుంబ సభ్యులు విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పారు. విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు, ప్రశాంత్, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

నేటి నుంచి 'ఓపెన్' డిగ్రీ తరగతులు

నర్సంపేట : నేటి (ఆదివారం) నుంచి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ గ్రూపుల 1, 3, 5వ సెమిస్టర్లకు సంబంధించిన తరగతులు ప్రారంభం అవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్‌లైన్ షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసిన సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. అభ్యాపకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచందర్ మాట్లాడుతూ ఆదివారాల్లో, ప్రతినెలా రెండో శనివారాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని సూచించారు.

యువకుడి ప్రతిభ.. డీఏఓగా ఎంపిక



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన కస్తూరి వినయ్ గ్రేడ్–2 పరీక్షలో ప్రతిభ చాటి డివిజనల్ అకౌంట్స్ అధికారి (డీఏఓ)గా ఉద్యోగం సాధించాడు. మొత్తం 53 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా సుమారు లక్షా 6 వేల మంది పరీక్ష రాశారు. మల్టీ జోన్ వారీగా ఫలితాలు వెలువడగా వినయ్ డీఏఓగా గెజిటెడ్ ఉద్యోగం సాధించాడు. వినయ్‌ను కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వర్ధన్నపేట : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో హిందు జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పట్టణంలో శనివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఓం ప్రకాశ్ ఆచారి, నర్సింహ ఆచారి, సాయి, విక్రమ్, కిరణ్ ఆచారి, మంజుల, మణి మాట్లాడారు. భగవద్గీతపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. పలువురు భక్తులు భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను కొనుగోలు చేశారు.

పశువుల సంరక్షణకు ప్రాధాన్యం

● కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న


పాడి రైతులకు కాల్షియం లవణ మిశ్రమ ప్యాకెట్లు అందజేస్తున్న పశు వైద్యులు

వర్ధన్నపేట : పశు వైద్య శాఖ పశువుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్టు మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న కోరారు. మండలంలోని చంద్రుతండాలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడిరైతులు రైతులు పశు సంపదను పెంపొందించుకుని ఆర్థిక ప్రయోజనాలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా 32 పశువులకు, 150 జీవాలకు చికిత్స అందించారు. ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. అలాగే చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు కాల్షియం ఖనిజ లవణ మిశ్రమాన్ని అందజేశారు. సుమారు 150 గొర్రెలకు నట్టల మందు తాగించారు. గొర్రెలు, మేకలకు ఉచితంగా బల వర్ధక మందులు పంపిణీ చేశారు. పశువుల ఎద లక్షణాల గుర్తింపు, కృత్రిమ గర్భధారణ ప్రాముఖ్యత, గర్భధారణ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చూడి పశువుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, పునరుత్పత్తి సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, వెటర్నరీ అసిస్టెంట్ విజయకుమార్, వర్ధన్నపేట పశు వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పకు దివ్య పడిపూజ, పుష్పాభిషేకం


దివ్యపడి పూజలో చేస్తున్న దాతలు


మెట్లపై పూజ చేస్తున్న వెంకటేశ్ గురుస్వామి

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో వెంకటేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం దివ్య పడిపూజ, పుష్పాభిషేకం నిర్వహించారు. జ్యోతులు వెలిగిస్తూ కలశం, వినాయక, గంగా పూజ చేపట్టారు. అయ్యప్ప విగ్రహానికి నెయ్యి, తేనె, పాలు, పెరుగు, చందనంతో అభిషేకం చేశారు. ఇరుకుల్ల వీరలింగం స్వరాజ్యం, మాధవశంకర్ రాజేశ్వరి, రీనా, రిషిత, రోనిత, దొండేటి సుజాత శ్రీనివాస్‌రావు, రావికంటి శ్రీదేవి అశోక్, యశస్విని, తక్కళ్లపల్లి జయలక్ష్మి సత్యనారాయణరావు, బండారు విజయలక్ష్మి దామోదర్, భూపతి కృష్ణమూర్తి పద్మ, సిరిమల్లె నిర్మల కుమారస్వామి, మానస మనోజ్‌కుమార్ అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా మాట్లాడారు. పంబారాట్టు పూజలు, అభిషేకాల కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, దేవునూరి అంజయ్య, మాధవశంకర్ గుప్తా, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, వంగేటి గోవర్ధన్, దోమకుంట్ల సదానందం, శ్రీరాముల శంకరయ్య, మిడిదొడ్డి బాబురావు, మదనపల్లి వెంకటేశ్వర్లు, చెకిలం కృష్ణమూర్తి, పాలకుర్తి శ్రీనివాస్, వజినపల్లి శ్రీనివాస్, పిన్న రామనాథం, శింగిరికొండ వేణుగోపాల్, భూపతి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై పాలకులు నిర్లక్ష్యం వీడాలి


నర్సంపేట : పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

● యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందీప్

నర్సంపేట : విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, జిల్లా అధ్యక్షుడు అలవాల నరేశ్ అన్నారు. డివిజన్‌లోని ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలను శనివారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ చేయించారు. ఈ సందర్భంగా సందీప్, అజయ్, నరేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో 51 మంది విద్యార్థులు మృతి చెందారని తెలిపారు. ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సమ్మెట వర్ధన్, పీడీఎస్‌యూ నాయకులు క్రాంతికుమార్, సురేశ్, హరిప్రసాద్, పవన్ కల్యాణ్, నిఖిల్, భగత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని ప్రభుత్వ స్కూళ్లను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడారు. విద్యార్థులకు భోజనం అందించే ఏజెన్సీలపై ప్రభుత్వానికి పట్టు లేదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, భగత్, క్రాంతి, కిషన్, విల్సన్, రాణి, శైలజ, కల్పన, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని కొత్తూరు, పెర్కవేడు, రాయపర్తి, తదితర గ్రామాల్లో స్కూళ్లను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు గౌరి రాజ్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ చోటు చేసుకుంటుండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు రేవంత్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో కళావేదిక ప్రారంభం


దుగ్గొండి : కళావేదికను ప్రారంభిస్తున్న దాతలు

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల వ్యయంతో నిర్మించిన కళావేదికను ఆ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ముక్క శ్రీనివాసరావు, వీరేశలింగం, నిహాల్ కృష్ణ శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారిలో అధికులు పేదలే అని చెప్పారు. పేద విద్యార్థులు చదువులో రాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి, ఉపాధ్యాయులు సుశీల, విజయలక్ష్మి, సుమలత, మహేశ్, మహ్మద్, రజిని, జుమ్మిలాల్, కిరణ్‌కుమార్, లీలావతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ స్కూల్‌కు..

నల్లబెల్లి : బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ముక్క శ్రీనివాసరావు, రమేశ్, వీరేశలింగం, నిహాల్ కృష్ణ మండలంలోని నందిగామ స్కూల్‌కు లక్ష రూపాయల విలువైన కంప్యూటర్ ప్రింటర్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, లైబ్రరీ పుస్తకాలు, సైన్స్ ల్యాబ్ పరికరాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేతివాటంపై విచారణ

సాక్షి స్పందన

ఖానాపురం: 'ధాన్యం తరలింపులో చేతివాటం' శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా సివిల్ సప్లయ్, సహకార శాఖల అధికారులు వివరాలు సేకరించారు. రైతుల నుంచి డబ్బు వసూలు చేసిందెవరనే వివరాలు సేకరించడంతోపాటు మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చర్యలు చేపట్టాలని మండల అధికారులను జిల్లాస్థాయి అధికారులు ఆదేశించినట్టు తెలిసింది. విజిలెన్స్ అధికారులు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి వివరాలు సేకరించడం గమనార్హం.

అడవుల్లో అగ్ని ప్రమాదాలు నివారించాలి



ఖానాపురం : అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించాలని డీఆర్‌ఓ రీనా కోరారు. మండలంలోని పాకాలలో శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు నివారించే దిశగా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఫ్యాన్సీ డ్రెస్ షో



రాయపర్తి : మండల కేంద్రంలోని లహరి పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఫ్యాన్సీ డ్రెస్ షో కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు దేవదాస్, రైతు, సైనికుడు, కేరళ కుట్టి, కలెక్టర్, వైద్యుడి, ద్రౌపది, సీతాదేవి, భీముడు, తదితర వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రవిచందర్ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు సరిత, స్వాతి, భాగ్యలక్ష్మి, సమీనా, స్వర్ణలత, అనురాధ, అన్నపూర్ణ, స్రవంతి, జ్యోతి, పూజ, జెరీనా, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నల్లబెల్లి : ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అటెండర్ సమ్మయ్యను నల్లబెల్లి, నర్సంపేట తహసీల్దార్లు కృష్ణ, రాజేశ్ శాలువాలు కప్పి మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. సమ్మయ్య 14 ఏళ్లపాటు సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్ కన్నా, ఆర్‌ఐ కార్తీక్, ఏఎస్‌ఓ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నల్లబెల్లి : ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బట్టు సాంబయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆకుల సాంబరావు, జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్, డివిజన్ అధ్యక్షుడు బొట్ల పవన్‌లకు కృతజ్ఞతలు తెలిపాడు.

హోటల్ కార్మికుడి హత్య

పర్వతగిరి : మండలంలోని అన్నారంలోని సుల్తానా హోటల్‌లో పని చేస్తున్న కార్మికుడు చేరాలు(50)ను పెద్దతండాకు చెందిన వెంకన్న హత్య చేశాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. చేరాలును వెంకన్న ఆటోలో తీసుకెళ్లి తీవ్రంగా కొట్టడంతో తలకు, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంకన్నను పట్టుకుని చేరాలును వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. చేరాలు దుగ్గొండి మండలం వెంకటాపురం వాసి కాగా బతుకు దెరువుకోసం వరంగల్‌లో ఉంటూ అన్నారంలో పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్తీక వన భోజనాలు

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటలోని పగడాల వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పద్మశాలి సంఘం బాధ్యులు శనివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు సాంబయ్య, యాకసాయన్న, రమేశ్, నర్సయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.